
# బీఆర్ఎస్‌తోనే సంక్షేమం సాధ్యం

**● డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి**

మామడ, నవంబర్ 28: ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయమని డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చందారం గ్రామంలో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల సమస్యలు తెలుసు కాబట్టే సీఎం కేసీఆర్ ప్రతి పథకం పేదల కోసమే పెట్టారని గుర్తు చేశారు. ఇప్పటికే అమలవుతు న్న పథకాలే కాకుండా కొత్తగా మరిన్ని పథకాలు అమలు చేయాలంటే ప్రతి ఒక్కరూ కారు గుర్తుపైనే ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మరోసారి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏనుగు లింగారెడ్డి, నాయకులు భాస్కర్‌రావు, రవీందర్‌రెడ్డి, శివారెడ్డి, గంగన్న, మహిపాల్‌రెడ్డి, రాంచందర్‌రెడ్డి, దిలీప్ తదితరులు ఉన్నారు.

### జోరుగా కారు ప్రచారం

దిలావర్‌పూర్, నవంబర్ 28: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నమూనా ఈవీఎంలతో ప్రజలకు ఓటు వేసి విధానం గురించి వివరించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల చిన్న దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, మళ్లీ అధికారంలోకి రాగానే చేపట్టే కొత్త సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపిస్తే నిర్మల్ నియోజక వర్గం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బన్సపల్లి సహకార సంఘం చైర్మన్ పీవీ రమణారెడ్డి, ఎంపీపీ అక్షర, అనిల్, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు డాక్టర్ సుభాష్‌రావు, మండల కో ఆప్షన్ సభ్యులు అన్వర్‌ఖాన్, జిల్లా రైతు బంధు సమితి సభ్యులు ఏలాల చిన్నరెడ్డి, కోడె రాజేశ్వర్, దనే రవి, భుజంగ్ రావు, ఇప్ప నర్సారెడ్డి, గంగారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మామడ: చందారంలో ప్రచారం నిర్వహిస్తున్నడీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి

సోన్, నవంబర్ 28: కారు గుర్తుకు ఓటేసి నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుదామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. నిర్మల్, సోన్ మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం చివరిరోజు ఇంటింటా తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి నిర్మల్ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. సోన్, న్యూవెల్మల్, బొప్పారం, మాదాపూర్, పాక్‌పట్ల, అక్కాపూర్, వెంగ్వాపేట్, చిట్యాల్, ముజ్గి, గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు.

### ఆలోచించి ఓటేయండి..

నర్సాపూర్ (జీ) నవంబర్ 28: మండలంలోని తిమ్మాపూర్, బూర్గుపెల్లిలో ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీ తీశారు. ఇంటింటికీ తిరగుతూ కారు గుర్తుకు ఓటేసి అల్లోల ఇంద్రరణ్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు కోరారు. ప్రతి పక్ష పార్టీలు రైతుబంధు రాకుండా అడ్డుకున్నాయని నాయకులు ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చిన్న రామయ్య, ఎంపీటీసీ మల్లేశ్, సర్పంచ్ రాంరెడ్డి, ఆర్‌బీఎస్ జిల్లా సభ్యులు కొంంద్ర రమేశ్, గోపిడి గంగారెడ్డి, ఫసి, మజార్, జుబేర్, శంకర్, మహేందర్, అమరేందర్, పాల్గొన్నారు,



దిలావర్‌పూర్: సిర్గాపూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు



పూలేకు నివాళులర్పిస్తున్న నిర్మల్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు

## తెలంగాణ సాధించిన ఘనత కేసీఆర్‌దే

**● నిర్మల్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి**

నిర్మల్ అర్బన్, నవంబర్ 28: రాష్ట్ర సాధన కోసం 2009 నవంబర్ 29న సీఎం కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్ ఫలితం రాష్ట్ర చరిత్రను మార్చిందని నిర్మల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ దీక్షా దివస్ కార్యక్రమం చేపట్టి 14 ఏండ్లు పూర్తయిన సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ అమరుల త్యాగాలను గుర్తు చేశారు. అనంతరం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధన కోసం ఆనాడు ఉద్యమం చేసిన ఉద్యమ నేత నేటి సీఎం కేసీఆర్ ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ సాధించారు. దీక్షా దివస్ స్ఫూరిని అమరుల త్యాగాలను, జ్ఞాపకాలను పోరాటాలను మరొక్కసారి గుర్తు చేసుకునేందుకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు దీక్షా దివస్‌ను జరుపుకుంటున్నామని అన్నారు. అంతకు ముందు మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వీ సత్యనారాయణ గౌడ్, పట్టణాధ్యక్షుడు మారుగొండ రాము, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అమరవేణి నర్సాగౌడ్, నజీర్ తదితరులున్నారు.

## బలహీన వర్గాల ఆశాజ్యోతి బాపూలే

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్,28: బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే అని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ అన్నారు. నిర్మల్ బీసీ సంఘంలో జ్యోతిబాపూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే ఆశయాలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ కొట్టూరి కిషన్, బీసీ యువజన నాయకులు దేశెట్టి నరేశ్, నాయకులు సరిపె అశోక్ తదితరులున్నారు.

## ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశాం: ఎస్పీ

నిర్మల్ అర్బన్, నవంబర్ 28: నిర్మల్ జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజికవర్గాల్లో ఈనెల 30న నిర్వహించే ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం ఎస్పీ మాట్లాడుతూ 743 పోలింగ్ కేంద్రాల వద్ద శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి 1000 మంది పోలీసు సిబ్బంది, 700 మంది కేంద్ర బలగాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 100 పెట్రోలింగ్ పార్టీలు, క్విక్ యాక్షన్ టీంలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ టీమ్స్‌ను అందుబాటులో ఉంచామన్నారు.

### జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

నిర్మల్ అర్బన్, నవంబర్ 28: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 2న జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలను స్థానిక వాసవి వరల్డ్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు భూపతి రెడ్డి, కార్యదర్శి సునీల్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్, ఫొటోలతో పోటీలకు హాజరుకావాలని ఎంపికైన క్రీడాకారులను డిసెంబర్ 4 నుంచి 7 వరకు నిజామాబాద్ జిల్లా మెండోర మండలం బుస్సాపూర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

### ఓటు వేసే విధానంపై అవగాహన

సోన్, నవంబర్ 28: సోన్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు ఓటు వేసే విధానంపై మంగళవారం ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. విద్యార్థులకు కరపత్రం ద్వారా వివరిస్తూ ఓటు విలువను తెలిపారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

నిర్మల్ టౌన్, నవంబర్ 28: ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో మూడు నియోజక వర్గాలకు సంబంధించిన కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు.

శాసనసభ ఎన్నికల సందర్భంగా మూడవ ర్యాండమైజేషన్ పూర్తయినట్లు జనరల్ అబ్జర్వర్ రవినందన్ కుమార్ విక్రమ్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల పరిశీలకులు కృష్ణ, విక్రమ్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు చెప్పారు. నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజక వర్గాల్లో పోలింగ్ విధులు నిర్వహించే అన్ని రకాల అధికారులకు ర్యాండమైజేషన్ పూర్తి చేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు పంపడం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అధికారులు పాల్గొన్నారు.

### కరెంటు కోతల కాంగ్రెస్ మాకొద్దు



మామడ, నవంబర్ 28: కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మళ్లీ రైతులకు కరెంటు కష్టాలే. చీకటి రోజులే. గతంలో ఎన్నో ఇబ్బందులు పెట్టిన్రు. కరెంటియ్యలే. నీళ్లియ్యలే. ఎరువులియ్యలే. కష్టముందని చెప్పినా పట్టించుకోలే. కానీ కేసీఆర్ సారు వచ్చాక రైతులకు కరెంటు కష్టాలు పోయినయ్. ఎవుసాన్ని పండుగలా మార్చి రైతులకు మూడు గంటల కరెంటు చాలంటూ రైతులను ఆగం చేయాలని చూస్తున్నరు. మూడు గంటల కరెంటుతో ఎవుసం చేయలేం. మూడు గంటల కరెంటిస్తే... రైతులంతా ఒకేసారి మోటర్లు ఆన్ చేస్తే ట్రాన్ ఫార్మర్లపై లోడు పడి కాలిపోయే ప్రమాదం ఉంది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మాకొద్దు. ఆ తిప్పలు మేము పడలేం. మాకు మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే కావాలి.

**-రవీందర్ రెడ్డి, రైతు, చందారం**

### కరెంటివ్వని కాంగ్రెస్ మాకెందుకు..?



మామడ, నవంబర్ 28: గత తొమ్మిదేండ్లుగా కరెంటు పుష్కలంగా ఉండడంతో రైతుల పంట పడింది. కాంగ్రెస్ హయాంలో తొమ్మిది గంటల కరెంటని చెప్పి.. కేవలం రెండు, మూడు గంటలు మాత్రమే ఇచ్చేటోళ్లు. అది కూడా మూడు విడుతల్లో ఇచ్చేటోళ్లు. ఆ నీరు కాలువలు తడవడానికే సరిపోయేది. పంటలు పండేవి కావు. సీఎంగా కేసీఆర్ వచ్చిన నాటి నుంచి కరెంటు పుష్కలంగా ఉంటున్నది. మంచిగా పంటలు పండుతున్నయ్. ఏ ఒక్క రైతుకూ ఇబ్బంది లేదు. కాంగ్రెస్ ను రైతులెవరూ నమ్మే పరిస్థితి లేదు. వాళ్లు గెలిచేది లేదు.

**-గంగన్న, రైతు,పొన్కల్**

### మూడు గంటలు ఏడ సరిపోద్ది



మామడ, నవంబర్ 28: నాడు కరెంటు కోసం అరిగోసపడ్డం. అప్పుడు నీళ్లు లేకుండె. కరంటు లేకుండె. మస్తు తిప్పలు పడ్డం. పంటలు ఎండిపోతంటే కండ్ల నీళ్లు పెట్టుకున్నం. ఎప్పుడొస్తదో.. ఎప్పుడు పోతదో తెల్వక రాత్రుల్లు బాయిల కాడనే జాగారం చేసినం. తెలంగాణ వచ్చినంక 24 గంటల కరెంట్ ఇయ్యవట్టె. ఇగ మాకు రాత్రిపూట పొలాలకు పోయే బాధలు తప్పినయ్. ఎప్పుడుపడితే అప్పుడు పొలాలకాడికి పోయి నీళ్లు పెట్టుకుంటున్నం. ఏ రందీ లేదు. నాడు అరిగోస పెట్టిన కాంగ్రెస్ మళ్లీ ఇప్పుడు మాయ మాటలు చెబుతున్నది. ఆ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు కానీ, రైతులను ఆగం చేస్తున్నది. మోటర్లకు మీటర్లు పెట్టే కుట్ర కూడా చేస్తరు. వాళ్లకు ఈ ఎల్లక్షన్లల బుద్ధి చెప్పాలె. కేసీఆర్‌నే మళ్ల గెలిపించుకోవాలె. లేకుంటే గోస అయితది.

**-శివారెడ్డి, రైతు, చందారం**

### రైతులకు కాంగ్రెస్ ఏమిచ్చింది..



దిలావర్‌పూర్ నవంబర్ 28: 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో రైతులకు ఏమిచ్చింద్రని ఇప్పుడు మళ్లీ ఓట్లు అడిగేందుకు మా ముందుకు వస్తున్నరు. వారి హయాంలో రైతుల అత్మహత్యలు, ఎండిన పంట పొలాలు, కాలిన మోటర్లు, పేలిన ట్రా న్స్‌ఫార్మర్లు తప్ప మాకు చేసింది శూన్యం. వారి పరిపాలన కాలంలో మొత్తం రోడ్లు ఎక్కి ధర్నాలు చేయడం తప్ప మాకు ఏం తెలియ లేదు. ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తరువాత వరి కొనుగోలు కేంద్రాల్లో రాసులకొద్దీ వరి ధాన్యం కుప్పలు, 24 గంటల ఉచిత విద్యుత్ అనందంగా పంటలను సాగు చేసుకుంటున్నం. 3 గంటల కరెంట్ ఇచ్చి మా కుటుంబాల్లో మళ్లీ పాత రోజులు తీసుకవచ్చేందుకు కాంగ్రెస్, ఢిల్లీ గద్దలు కుట్ర పన్నుతున్నరు. వాళ్ల ఆటలను కేసీఆర్ సాగనివ్వరు. కచ్చితంగా వాళ్లు మళ్లీ ముట్లే మూట సర్దుకుంటరు. ప్రజలు వాళ్లను నమ్మేది లేదు. వాళ్లు గెలిచేది లేదు. నమ్మితే ఆగతమైతదని ప్రజలకు మస్తుగ తెలుసు. రేపు జరిగే ఎన్నికల్లో ఎవరికి ఓటెయాల్నో అప్పుడే అందరూ డిసైడ్ అయ్యిన్రు.

**-గంగారెడ్డి, యువ రైతు**